# సాక్షి కృష్ణాజిల్లా


ఆదివారం । 16 । జూన్ । 2024






### నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి: బెజవాడ దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్న దానానికి ఏలూరుకు చెందిన నక్కా వరప్రసాద్ కుటుంబం శనివారం రూ.1,00,116 విరాళం సమర్పించింది. అనంతరం అమ్మవారిని దర్శించుకుంది.



### సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 504.60 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 810.70 అడుగుల వద్ద ఉంది.



### మంత్రికి శుభాకాంక్షలు

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్రను కృష్ణా జిల్లా ఎక్సైజ్‌శాఖాధికారి అవులయ్య శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## న్యూస్‌రీల్

### వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి



లబ్బీపేట(విజయవాడతూర్పు): పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని ఆదేశించారు. నగరంలోని తన కార్యాలయంలో శనివారం యూపీహెచ్‌సీల్లో పనిచేసే వైద్యాధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ నిర్దేశిత సమయంలో వైద్యం కోసం వచ్చే రోగులకు అందుబాటులో ఉండి మానవతా విలువలు పాటించాలని సూచించారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉండాలని, అవసరమైన వారికి తప్పనిసరిగా ల్యాబ్ పరీక్షలు చేయించాలని ఆదేశించారు. యూపీహెచ్‌సీ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ జరిగేలా చూడాలని, మాతాశిశు సంరక్షణ సేవలు, డయేరియా నిర్మూలన క్యాంపెయిన్, ఆయుష్మాన్ భారత్ హెల్త్ నమోదు సంఖ్యలు, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ జూపూడి ఉషారాణి, డీఐఓ డాక్టర్ అమృత, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఇందుమతి పాల్గొన్నారు.

### ఉత్తమ నాటికగా 'స్వప్నం రాల్చిన అమృతం'



విజయవాడ కల్చరల్: హర్ష క్రియేషన్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహించిన జాతీయ స్థాయి నాటికల పోటీ ఫలితాలను సంస్థ అధ్యక్షుడు కత్తి శ్యాం ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పిళ్లా నటరాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్‌కు చెందిన చైతన్య కళాభారతి వారు ప్రదర్శించిన 'స్వప్నం రాల్చిన అమృతం' ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైందని తెలిపారు. సిరిమువ్వ కల్చరల్ ఆర్ట్స్ హైదరాబాద్ వారి 'మాట్లాడుకుందాం' ద్వితీయ స్థానం, కార్తీక్ క్రియేషన్స్ కాకినాడ వారి 'ఎడారిలో వాన చినుకులు' తృతీయ స్థానంలో నిలిచాయని పేర్కొన్నారు. ఉత్తమ రచన ఎడారిలో కోయిల (శారదాప్రసన్న), ఉత్తమ దర్శకుడిగా తాళాబత్తుల వెంకటేశ్వరరావు (అనూహ్యం), ఉత్తమ నటులుగా డి.రాధాకృష్ణ, ఎం.వి.రాజ్‌ఋషి, ఉత్తమ నటీమణులుగా ఎస్.జ్యోతిరాణి, సింధూరి పూజిత, ఉత్తమ క్యారెక్టర్ నటుడిగా పూర్ణసత్యం, ఉత్తమ సహాయనటిగా బందారు నాగరాణి, ప్రతినాయకుడిగా దొరబాబు, బాలనటిగా సురభి వాగ్దేవి, మేకప్ శ్రీధర్, లైటింగ్ సురభి ఉమాశంకర్ బహుమతులు గెలుచుకున్నారు. విద్యావేత్త దొంతల ప్రకాష్, సంస్కార భారతి సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు భాస్కరశర్మ, సాంస్కృతిక కళా సంస్థల ఐక్యవేదిక అధ్యక్షుడు బోడి ఆంజనేయరాజు, నటీమణులు అమృతవర్షిణి, గుడివాడ లహరిల చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఈ పోటీల న్యాయ నిర్ణేతలుగా అనంత హృదయరాజ్, నటరాజ్ వ్యవహరించారు.

### బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి



మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలోని బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేస్తానని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు. నగరంలోని బందరుకోట శ్రీ కోదండ రామాలయంలో మంత్రి రవీంద్ర సతీసమేతంగా శనివారం శ్రీ సుదర్శన హోమం నిర్వహించారు. హోమం అనంతరం శ్రీ రాజరాజేశ్వరి పీఠం (హైదరాబాద్) నిర్వాహకుడు, వేద పాఠశాల వ్యవస్థాపకుడు శివప్రసాద్ శర్మ, రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన రాష్ట్ర అధికార ప్రతినిధి పి.వి.ఫణికుమార్, తెలంగాణ బ్రాహ్మణ సంఘం నాయకులు, అర్చకులు, పురోహితులు ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్రను కలిశారు. మంత్రి రవీంద్ర మాట్లాడుతూ.. బ్రాహ్మణుల సంక్షేమానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మంగళంపల్లి భాస్కరశర్మ తదితరులు పాల్గొన్నారు.

# భవిత సర్వే పూర్తి

- జిల్లా వ్యాప్తంగా గడపగడపకు భవిత కేంద్రాల ఐఈఆర్పీలు
- ఈ నెల 9న సర్వే పూర్తి.. 403 మంది చిన్నారుల గుర్తింపు
- సమగ్ర శిక్ష ద్వారా ప్రభుత్వ పథకాలను అందించేలా కృషి
- సర్వేకు ముందు 2,961 మందికి భవిత కేంద్రాల్లో సేవలు



గుడ్లవల్లేరు మండలంలో సర్వేను పరిశీలిస్తున్న సహిత విద్య సమన్వయకర్త ఏడుకొండలు, పక్కన ఐఈఆర్పీ హామీద్ తదితరులు

పెడన: కృష్ణా జిల్లాలో మానసిక దివ్యాంగ చిన్నారులను గుర్తించి, భవిత కేంద్రాల ద్వారా బంగారు భవిష్యత్‌కు బాటలు వేసేందుకు చేపట్టిన సర్వే పూర్తయింది. ఈ నెల తొమ్మిదో తేదీ పూర్తయిన సర్వేలో 403 మంది మానసిక దివ్యాంగులైన చిన్నారులను ఆయా భవిత కేంద్రాల ఐఈఆర్పీలు గుర్తించారు. సమగ్ర శిక్ష జిల్లా సహిత విద్య ద్వారా మానసిక దివ్యాంగులైన చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించడమే కాకుండా ప్రతివారం ఫిజియోథెరపీ సేవలు అందించి వారి ఆరోగ్యాన్ని మెరుగు పరిచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే పలువురు చిన్నారులను వారి తల్లిదండ్రులు భవిత కేంద్రాల్లో చేర్పించారు. ఇంకా భవిత కేంద్రాలకు రాని చిన్నారులు ఉన్నారని ప్రభుత్వం గుర్తించింది. బుద్ధిమాంద్యంతో బాధపడుతున్న తమ చిన్నారులను నలుగురిలోకి తీసుకొచ్చేందుకు తల్లిదండ్రులకు మానసిక ధైర్యం లేకపోవడమే కారణమని అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ప్రత్యేక అవసరాలు గల పిల్లలను పాఠశాలలకు రప్పించేలా భవిత కేంద్రంలోని ఐఈఆర్పీలు చర్యలు తీసుకున్నారు. తమ మండలాల పరిధిలో భవిత కేంద్రాలకు రాని మానసిక దివ్యాంగులు, బుద్ధిమాంద్యంతో బాధపడుతున్న చిన్నారులను గుర్తించేందుకు మే ఒకటో తేదీ నుంచి భవిత కేంద్రాల ఐఈఆర్పీలు సర్వే చేపట్టారు. ఈ సర్వే ఈ నెల తొమ్మిదో తేదీన పూర్తయిన స్వేలో 403 మంది మానసిక దివ్యాంగులను గుర్తించారు.

### జిల్లాలో 25 భవిత కేంద్రాలు

కృష్ణాజిల్లా వ్యాప్తంగా 25 భవిత కేంద్రాలు నడుస్తున్నాయి. ఈ కేంద్రాల్లో పరిధిలో 2,961 మంది మానసిక దివ్యాంగులు, బుద్ధిమాంద్యం గల విద్యార్థులు విద్యాబుద్ధులు నేర్చుకుంటున్నారు. వారిలో అవసరమైన వారికి వారంలో ఒక రోజు ఫిజియోథెరపిస్టుతో ద్వారా ఫిజియోథెరపీ చేయిస్తున్నారు. గత ఏడాది జూన్‌లో నిర్వహించిన ప్రత్యేక శిబిరాల్లో 0 నుంచి 18 ఏళ్లలోపు 176 మంది పాఠశాలలకు రాకుండా ఇంటి వద్దే ఉంటున్న ప్రత్యేకావసరాలు గల పిల్లలను గుర్తించారు. ఇటువంటి వారు ఇంకా ఉన్నారనే సమాచారంతో సర్వే చేశారు. మండలాల్లో అంగన్‌వాడీ వర్కర్లు, ఏఎన్‌ఎంల సాయంతో సర్వే పూర్తి చేశారు.

### ప్రత్యేక అవసరాల పిల్లలకు అలవెన్సులు

ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రభుత్వం నాలుగు రకాల అలవెన్సులను అందజేస్తోంది. బడికి వచ్చే మానసిక దివ్యాంగులు, బుద్ధిమాంద్యం ఉన్న వారికి, ఇంటి వద్ద ఉంటున్న వారికి, బాలికలకు అలవెన్సులను ఇస్తున్నారు. బడికి వచ్చే వారికి రీడర్ అలవెన్సు కింద నెలకు రూ.200 చొప్పున పది నెలలకు ఒకసారి రూ.2 వేలు అందజేస్తున్నారు. బడికి వచ్చే వారికి ఎస్కార్ట్ అలవెన్సు కింద నెలకు రూ.200, బాలికలకు ప్రత్యేకంగా (అదనం) గరల్ చైల్డ్ అలవెన్సు కింద రూ.200, హోమ్ బేస్డ్ అలవెన్సు కింద బడికి రాకుండా ఇంటి వద్దే ఉంటున్న ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి నెలకు రూ.200 చొప్పున పది నెలలకు రూ.2 వేలు ఇస్తున్నారు. బడికి వెళ్లే వారికి పాఠశాలలో అందరి విద్యార్థులతోపాటు వారికి కూడా యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, షూ, బెల్టులను అందజేస్తున్నారు. అమ్మవడి పథకం కూడా వర్తింపజేస్తున్నారు. వారిని ప్రత్యేక వైద్య నిపుణులతో పరీక్షలు చేయించి వారికి ఎటువంటి పరికరాలు అవసరమో గుర్తించి వీరితో దరఖాస్తులు పూర్తి చేసి అవసరమైన పరికరాలను అందించేలా చర్యలు తీసుకోనున్నారు.

### అత్యధికంగా గన్నవరంలో 30 మంది

కృష్ణా జిల్లా వ్యాప్తంగా 25 మండలాల్లో 403 మంది ప్రత్యేక అవసరాలు గల (మానసిక దివ్యాంగులు) పిల్లలను గుర్తించారు. అత్యధికంగా గన్నవరం మండలంలో 30 మంది ఉన్నారు. ఆ తర్వాత కంకిపాడులో 27 మంది, గుడివాడలో 24 మంది, పమిడిముక్కల, గూడూరులో 20 మంది చొప్పున, మోపిదేవి, ఉయ్యూరు, పెనమలూరులో 19 మంది చొప్పున, నాగాయలంకలో 18 మంది, అవనిగడ్డ, బాపులపాడు, ఉంగుటూరులో 16 మంది చొప్పున, ఘంటసాల, మొవ్వ, పామర్రు, నందివాడ, తోట్లవల్లూరులో 15 మంది చొప్పున, బంటుమిల్లిలో 14 మంది, పెదపారుపూడిలో 13 మంది, చల్లపల్లి, మచిలీపట్నం, కోడూరులో 12 మంది చొప్పున, గుడ్లవల్లేరు, పెడనలో 9 మంది చొప్పున, కృత్తివెన్నులో ముగ్గురు చొప్పున ఉన్నారు.

### తల్లిదండ్రులను ప్రోత్సహించాలి



ప్రస్తుతం ప్రత్యేక అవసరాల గల పిల్లలను గుర్తించడంలో ఐఈఆర్పీలు సత్ఫలితాలు సాధించారు. జిల్లా వ్యాప్తంగా 403 మంది మానసిక దివ్యాంగ చిన్నారులను గుర్తించారు. వారంతా అంగన్‌వాడీ కేంద్రాలకు, బడులకు, కళాశాలలకు వెళ్లాల్సిన వారు. వారిని చైతన్యపరిచి భవిత కేంద్రాలకు రప్పించి విద్యాబుద్ధులు నేర్పించేలా చూడాలన్నది లక్ష్యం. వారి తల్లిదండ్రులను మరింత చైతన్యపరచాల్సి ఉంది. ఇప్పటికీ వారిని బడికి పంపేందుకు తల్లిదండ్రులు ఇష్టపడటం లేదు. వారికి ధైర్యం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటాం.

– కె.రాములునాయక్, ఏపీసీ, సమగ్ర శిక్ష, కృష్ణా జిల్లా

### ఖరీఫ్‌కు అధికారులు సంసిద్ధం కావాలి

కృష్ణా జిల్లా వ్యవసాయాధికారి పద్మావతి



పామర్రు: ఖరీఫ్ సీజన్‌కు సంబంధిత అధికారులు సంసిద్ధం కావాలని కృష్ణాజిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.పద్మావతి ఆదేశించారు. సీజన్‌లో చేపట్టాల్సిన వ్యవసాయ శాఖ కార్యక్రమాలను సక్రమంగా నిర్వహిస్తూ రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పామర్రు సబ్‌డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల వ్యవసాయశాఖ అధికారులు, వ్యవసాయ సహాయకులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పద్మావతి మాట్లాడుతూ.. మట్టినమూనా పరీక్షల ఫలితాలను రైతులకు తెలిపేలా చర్యలు తీసుకోవాలని, రైతు భరోసా కేంద్రాల ద్వారా పచ్చిరొట్ట విత్తనాలు, వరి విత్తనాలను డీ-క్రిష్ యాప్ ద్వారా గ్రామ వ్యవసాయ సహాయకులు పంపిణీ చేయాలని ఆదేశించారు. పీఎంకిసాన్‌లో ఐదు శాతం ఫిజికల్ వెరిఫికేషన్ రికార్డులను వెంటనే గ్రామాల్లో పరిశీలన చేసి అనర్హులు ఉంటే గుర్తించాలని వీఏఏలకు సూచించారు. ఆర్బీకేల్లో అవసరమైన ఎరువుల ఇన్‌టెండ్‌లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం డీడీఏ ఎస్.వి.మనోహర్, ఏడీఏ ఎస్‌మణిధర్, పామర్రు ఏడీఏ స్వర్ణలత, టెక్నికల్ ఏఓలు బి.సురేష్ బాబు, నాయక్, జి.గీతాంజలి, జి.సురేఖ, జి.శ్రీదేవి, డివిజన్ పరిధిలోని పామర్రు, గుడ్లవల్లేరు, తోట్లవల్లూరు, కంకిపాడు మండలాల ఏఓలు వి.శివనాగరాణి, ఎల్.సునీల్, పి.మాధురికిరణ్, జి.నాగేశ్వరరావు, ఆయా మండలాల వీఏఏలు, ఏపీఓలు పాల్గొన్నారు.

**రిజిస్టర్లను అప్‌డేట్ చేయాలి**

డివిజన్ పరిధిలో డీలర్లతో జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి శనివారం సమావేశమయ్యారు. డీలర్లు అందరూ ఎరువులు, పురుగుమందులు, విత్తనాల రిజిస్టర్లు, బిల్ బుక్స్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. ఎమ్మార్పీకి మించి ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# స్థిరంగా పచ్చ బంగారం ధర

- గతంలో ఎన్నడూ లేని విధంగా ఎండు పసుపు ధరలు
- 15 రోజులుగా క్వింటా ధర రూ.14 వేలకు పైనే..
- మార్కెట్‌లో రేటు మరింతగా పెరుగుతుందన్న ఆశలో రైతులు



పసుపు కొమ్ముల రాశి

కంకిపాడు: పచ్చబంగారంగా పేరు పొందిన పసుపు ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. 15 రోజులుగా మార్కెట్‌లో ఒకే ధర పలుకుతోంది. మరో పది రోజుల్లో ధర మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు ఎదురు చూస్తున్నారు. తమ వద్ద నిల్వ చేసిన పంటను మంచి ధర వస్తే విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నారు.

**2,763 హెక్టార్లలో సాగు**

వాణిజ్య పంటల్లో ప్రధాన వాణిజ్య పంటల్లో పసుపు కూడా ఒకటి. దీన్ని పచ్చ బంగారంగా ఇక్కడి రైతులు పిలుస్తారు. జిల్లాలో ఏటా 2,763 హెక్టార్లకు తగ్గకుండా పసుపు సాగవుతుంది. గత సీజన్‌లో జిల్లాలో 2,763 హెక్టార్లలో పసుపు సాగైంది. ప్రధానంగా కడప, మైదుకూరు, ప్రగతి, శేలం, ఇతర రకాలను ఇక్కడి రైతులు సాగు చేసుకుంటున్నారు. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో పసుపు తవ్వకం, వంట పనులను పూర్తి చేశారు. ఒక్కో రైతుకు ఎకరాకు పచ్చి పసుపు 60 పుట్లు (పుట్టు అంటే 225 కిలోలు) దిగుబడి లభించింది. ఎండు పసుపు 12 పుట్ల వరకూ దిగుబడి వచ్చింది. కౌలురైతులు అయితే ఎకరాకు మూడు పుట్ల వరకూ కౌలు చెల్లించి మిగిలిన పంటను మార్కెట్‌లో విక్రయిస్తున్నారు.

**గతంలో ఎన్నడూ లేని ధర**

గతంలో ఎన్నడూ లేని ధర ఈ ఏడాది పసుపు పంటకు లభించింది. 2009 తరువాత ఎప్పుడూ రూ.10 వేల ధర దాటలేదు. 2009లో క్వింటా పసుపు ధర రూ.16 వేలు పలికింది. ఈ ఏడాది కూడా క్వింటా పసుపు ధర రూ.14 వేల నుంచి రూ.15,550 వరకూ చేరింది. వాతావరణ పరిస్థితులు అనుకూలించటం, దిగుబడులు నాణ్యంగా ఉండటంతో నాణ్యమైన పంట మార్కెట్‌కు చేరుతోంది. దీంతో రైతుకు ఆశించిన ధర దక్కుతోంది. 15 రోజులుగా క్వింటా ధర రూ.14 వేల నుంచి రూ.14,500 వరకూ ఉంది. ధర స్థిరంగా కొనసాగటంతో రైతులు తమ వద్ద ఉన్న పంట అమ్ముకోవాలా? లేక నిల్వ చేసుకోవాలా? అన్న మీమాంశలో ఉన్నారు. మార్కెట్‌లో ధర పెరిగే అవకాశం ఉందన్న ప్రచారంతో కొందరు రైతులు పంట దెబ్బ తినకుండా గోదాముల్లో భద్రపరుచుకుంటున్నారు. మంచి ధర పలికితే పంటను విక్రయించాలని భావిస్తున్నారు.

# లైబ్రరీ సెస్ బకాయిలు సకాలంలో చెల్లించాలి

కృష్ణా జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థకు చెల్లించాల్సిన లైబ్రరీ సెస్ బకాయిలను ఈ నెల 30వ తేదీలోగా జమచేయాలని జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ అధికారులను ఆదేశించారు. ఆమె శనివారం మునిసిపల్ కమిషనర్లు, పంచాయతీ అధికారులతో వర్చువల్ సమావేశాన్ని నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రంథాలయ సంస్థకు 2016 నుంచి రూ.11.90 కోట్ల బకాయిలను జిల్లా పంచాయతీలతో పాటు మునిసిపాలిటీలు సక్రమంగా చెల్లించటం లేదన్నారు. వాటి చెల్లింపునకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అత్యధికంగా రూ.8 కోట్లు బకాయిలు ఉండగా, మచిలీపట్నం నగరపాలక సంస్థ రూ.23 లక్షలు, గుడివాడ మునిసిపాలిటీ రూ.1.35 కోట్లు, పెడన రూ.3.2 లక్షలు, ఉయ్యూరు రూ.9.2 లక్షలు, వైఎస్సార్ తాడిగడప రూ.1.67 కోట్ల మేర బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. నూజివీడు మునిసిపాల్టీకి సంబంధించిన బకాయిలను ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధి లేదా కొత్తగా ఏర్పడిన ఏలూరు జిల్లాకు చెల్లింపు విషయమై తగిన వివరణ తీసుకోవాలని గ్రంథాలయ సంస్థ అధికారులకు సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అన్ని మునిసిపాల్టీలు 15 శాతం సర్వీస్ చార్జీలను మినహాయించుకుని మిగిలిన మొత్తాలను చెల్లించాలన్నారు. ఇకపై సంవత్సరానికి కాకుండా నెలవారీ లేదా త్రైమాసానికి ఒకసారి క్రమం తప్పకుండా సెస్‌లను చెల్లించాలని పేర్కొన్నారు.



# సందట్లో సడేమియా



సత్యనారాయణపురంలో బైక్ చోరీ చేస్తూ సీసీ కెమెరాకు చిక్కిన యువకులు

- ఉమ్మడి కృష్ణాజిల్లాలో వరుస చోరీలు
- పలు దుకాణాల్లో వస్తువుల అపహరణ
- ఇంటి ముందు పార్క్ చేసిన బైక్‌ల చోరీ


విజయవాడస్పోర్ట్స్: దొంగల చేతి వాటం ప్రదర్శన మితిమీరింది. ఎన్నికలు, ఓట్ల లెక్కింపు, కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం, బాధ్యతల స్వీకరణ విధుల్లో పోలీసులు నిమగ్నం కావడం దొంగలకు కలిసొచ్చింది. పోలీసుల నిఘా అంతగా లేకపోవడంతో వరుస చోరీలతో బెంబేలెత్తిస్తున్నారు. గడిచిన వారం రోజుల వ్యవధిలో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలో అనేక చోరీ కేసులు వెలుగు చూశాయి. ఒక్క శుక్రవారం అర్ధరాత్రే ఏడు ప్రాంతాల్లో దొంగతనాలు జరిగాయి. దీంతో ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రజల్లో ఆందోళన మొదలైంది.

**బైక్ చోరీలే ఎక్కువ**

విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో దొంగలు హల్‌చల్ చేశారు. నందమూరినగర్‌లో అర్ధరాత్రి నలుగురు యువకులు ఆ ప్రాంతాల్లో బైక్‌లను చోరీ చేశారు. ఈ ముఠా ముందుగా బైక్‌లలో పెట్రోల్ దొంగతనానికి ప్రయత్నించింది. ఆ తరువాత నెమ్మదిగా అదే బైక్‌లను చోరీ చేసినట్లు అక్కడి సీసీ కెమెరాల పుటేజీలో స్పష్టంగా నమోదైంది. నందమూరినగర్‌తో పాటు న్యూ ఆర్‌ఆర్‌పేట ప్రాంతాల్లోనూ ద్విచక్ర వాహనాల దొంగతనం జరిగినట్లు సీసీ పుటేజీలు వెలుగులోకి తెచ్చాయి. సింగ్‌నగర్‌లోనూ కొన్ని బైక్‌లను దొంగలు మాయం చేశారు. వారం రోజుల క్రితం సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ పరిధిలోనూ ఇదే తరహా ఘటనలు వెలుగు చూశాయి. కొందరు యువకులు రాత్రి సమయంలో బైక్‌లను దొంగిలిస్తూ సీసీ కెమెరాలకు చిక్కిన దృశ్యాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ ప్రాంతాల్లోని గృహాల్లో పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో అక్కడి ప్రజలు వారి ఇళ్ల ముందే బైక్‌లను పార్కింగ్ చేస్తుంటారు. రాత్రి సమయంలో నిర్మానుష్యంగా ఈ ప్రాంతాలు ఉండటంతో యథేచ్ఛగా దొంగతనాలు జరుగుతున్నాయి. ఎనికేపాడు కేవీఆర్ నగర్‌లోని పచారీ దుకాణంలో దొంగలు చేతివాటం ప్రదర్శించి బంగారం, నగదుతో ఉడాయించారు. ఈ నెల తొమ్మిదో తేదీ ఆదివారం ఇబ్రహీంపట్నంలోని తాళం వేసి ఉన్న రెండు ఇళ్లలోకి దొంగలు చొరబడ్డారు. ఒక ఇంట్లో రూ.2 లక్షల నగదు పది కాసుల బంగారం, మరో ఇంట్లో 25 కాసుల బంగారం, రూ.1.20 లక్షల నగదును దొంగిలించారు.

### గోవులను వధిస్తే కఠిన చర్యలు

పోలీస్ కమిషనర్ రామకృష్ణ



విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు జంతు పరిరక్షణ చట్టాలను ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో పటిష్టంగా అమలు చేస్తున్నామని పోలీస్ కమిషనర్ పి.హెచ్.డి. రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా గోవులు, జంతువులను అక్రమంగా రవాణా చేసిన, వధించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. పశువులను వధిస్తున్నట్లు, అక్రమంగా నిల్వ ఉంచినట్లు తెలుసుకుని అక్కడి వారిపై భజరంగ్‌దళ్, ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ తదితర సంస్థల ప్రతినిధులు దాడులు చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టంచేశారు. దాడులు చేసే వారిపైనా చర్యలు తప్పక తీసుకుంటామని పేర్కొన్నారు. జంతు వధను నిలువరించేందుకు ఏసీపీ బి.పార్థసారథిని నోడల్ అధికారిగా నియమించామని సీపీ రామకృష్ణ తెలిపారు. జంతువులను వధిస్తున్నట్లు ఎవరికైనా తెలిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. 94406 27073 సెల్ నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇస్తే జంతు వధను అరికడతామని సీపీ రామకృష్ణ తెలిపారు.

### వెస్ట్ గోదావరిపై గుంటూరు విజయం



సెంచరీ చేసిన గుంటూరు జట్టు క్రీడాకారుడు చందు

మూలపాడు(ఇబ్రహీంపట్నం): వెస్ట్ గోదావరి జట్టుపై గుంటూరు జిల్లా జట్టు 132 పరుగుల తేడాతో భారీ విజయం నమోదు చేసుకుంది. మూలపాడు గ్రామంలోని ఏసీఏ గ్రౌండ్‌లో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సెంట్రల్ జోన్ అండర్ 23 ఇంటర్ డిస్ట్రిక్ట్ వన్‌డే మెన్ క్రికెట్ టోర్నీలో ఐదో రోజు శనివారం వెస్ట్ గోదావరి, గుంటూరు జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న గుంటూరు జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 357 పరుగుల భారీస్కోర్ చేసింది. జట్టు క్రీడాకారులు చందు 79 బంతుల్లో 12 ఫోర్లు, 5 సిక్స్‌లతో 109, మహ్మద్ సిద్దిక్ 48 బంతుల్లో 7 ఫోర్లుతో 60 పరుగులు చేసి జట్టు భారీస్కోర్‌కు తోడ్పడ్డారు. అనంతరం బ్యాటింగ్ చేసిన వెస్ట్ గోదావరి జట్టు నిర్ణీత 50 ఓవర్లకు 8 వికెట్లు కోల్పోయి 225 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. జట్టులో స్వామినాయుడు 64, కె.ఎస్.ఎన్.రాజు 87 పరుగులు చేసి ఫర్వాలేదనిపించారు. గుంటూరు జట్టు 132 పరుగుల తేడాతో విజయం సాధించింది.

## క్లుప్తంగా

### చోడవరంలో చోరీపై కేసు నమోదు

పెనమలూరు: చోడవరంలో చోరీ జరిగిన ఘటనపై పోలీసులు ఆలస్యంగా కేసు నమోదు చేశారు. పెనమలూరు క్రైమ్ పోలీసులు శనివారం నాడు తెలిపిన వివరాల ప్రకారం... చోడవరం గ్రామానికి చెందిన మద్దుకూరి వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులతో ఉంటున్నారు. ఎన్నికల సందర్భంగా పెద్ద కుమారుడు సుబ్బారావు బెంగళూరు నుంచి వచ్చాడు. కుమారుడితో కలిసి గత నెల 14వ తేదీ రాత్రి వెంకటేశ్వరరావు, భార్య బెంగళూరు వెళ్లారు. అయితే మే 27వ తేదీన చోడవరంలో ఇంటి పక్కన ఉన్న వారు ఇంటి తాళాలు పగులకొట్టి ఉన్నాయని వెంకటేశ్వరరావుకు సమాచారం ఇచ్చారు. దీంతో 28 రాత్రి 2 గంటలకు వెంకటేశ్వరరావు బెంగళూరు నుంచి చోడవరం వచ్చాడు. ఇంట్లో వస్తువులు చూడగా బీరువా తలుపులు తెరిచి దాదాపు 9 కాసుల బంగారు ఆభరణాలు, 900 గ్రాముల వెండి వస్తువులు దొంగలు చోరీ చేసినట్లు గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేసి శనివారం కేసు నమోదు చేశారు.

### మొక్కు చెల్లింపు



మోపిదేవి: పాదయాత్ర ద్వారా మోపిదేవి చేరుకున్న పలువురు అభిమానులు, భక్తులు శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని శనివారం దర్శించుకున్నారు. బాపట్ల జిల్లా పెద్ద పులుగువారిపాలెంకు చెందిన పలువురు తమ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా నరేంద్ర వర్మ విజయాన్ని కాంక్షిస్తూ అక్కడ నుంచి పాదయాత్ర చేపట్టారు. తమ కోరిక నెరవేరినందుకు స్త్రీ, పురుషులు సుమారు 100 మంది పాదయాత్రగా వచ్చి స్వామివార్లను దర్శించుకొని మొక్కు చెల్లించారు. స్థానికులు వారికి స్వాగతం పలికారు.

### విద్యార్థిని మృతిపై విచారణ జరిపించాలి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): శ్రీచైతన్య కళాశాల గూడవల్లి రామన్ భవన్‌లో ఇంటర్మీడియట్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బి.జాహ్నవి అనే విద్యార్థిని శనివారం అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటనపై విచారణ జరిపించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యు) నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వాసుపత్రి మార్చురీలో ఉన్న జాహ్నవి మృతదేహాన్ని నాయకులు శనివారం పరిశీలించారు. పీడీఎస్‌యు జిల్లా అధ్యక్షుడు ఐ.రాజేష్ మాట్లాడుతూ జాహ్నవి మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.



# పవిత్ర బక్రీద్ పండుగకు సిద్ధం

- జిల్లాలో ఘనంగా ఈద్–ఉల్–అద్హా నిర్వహణకు ఏర్పాట్లు
- బక్రీద్ సందర్భంగా ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేయనున్న ముస్లింలు
- సర్వ మానవాళి కోసం దువా చేయనున్న మత పెద్దలు
- ఈద్గాలతో పాటు మసీదుల్లోనూ ప్రార్థనలు



సాక్షి, మచిలీపట్నం: త్యాగానికి ప్రతీక పవిత్ర బక్రీద్ పండుగ ఈదుల్ అద్హాను వ్యాప్తంగా ఘనంగా జరుపుకునేందుకు ముస్లింలు సిద్ధమవుతున్నారు. 17వ తేదీ సోమవారం పండగ ఉండడంతో ప్రత్యేక ప్రార్థనలకు సిద్ధం చేసుకుంటున్నారు. ఈద్గాలతో పాటు మసీదుల్లోనూ నమాజ్ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ రోజు ఉదయం 6 గంటల నుంచే శుద్ధి స్నానం చేసి కొత్త బట్టలు వేసుకుని ఈద్ నమాజ్ చదివేందుకు ఈద్గాల వైపు అడుగులు వేసుకుంటూ బయలుదేరుతారు. 'అల్లాహు అక్బర్.. అల్లాహు అక్బర్... లా ఇలాహ ఇల్లల్లా... హు అల్లాహు అక్బర్... అల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హంద్' అంటూ తక్బీర్ చదువుకుంటూ ఈద్గాలకు చేరుకుంటారు. ఈదుల్ అద్హా కోసం ఈద్గాలకు వెళ్లలేని వారు సమీపంలోని మసీదులకు వెళ్లి ఈద్ నమాజు చేస్తారు. ఈద్గా, మసీదుల్లో నమాజు చేయించే ఖాజీలు, మౌల్వీలు తమ ఆధ్యాత్మిక ప్రసంగం అనంతరం దువా చేస్తారు. సర్వ మానవాళి శాంతి కోసం, జీవితంలో చేసిన పాపాల విముక్తి కోసం అల్లాహ్‌ను వేడుకుంటారు. నమాజు, దువా అనంతరం ఒకరినొకరు ఈద్ ముబారక్ చెప్పుకుంటూ కరచాలనం, ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకుంటారు. కొందరు బక్రీద్ సందర్భంగా ఉపవాసాలు ఉండగా వీటి ప్రత్యేకత, పుణ్యం తెలుసుకొని మరి కొందరు ఈద్‌కు ఒక రోజు ముందు రోజా పాటిస్తారు. ఇంకొందరు పండగ రోజు ఈద్ నమాజ్ పూర్తయ్యే వరకు ఏమీ తినకుండా వెళ్లి ప్రార్థనలు చేస్తారు. పండుగ శుభాలు జరగాలని కోరుకుంటారు. ఆధ్యాత్మికంగా జరిగే పండుగ నమాజ్‌లో పాల్గొనేందుకు తరలి వచ్చే ముస్లింలతో ఈద్గాలు, మసీదులు కళకళలాడనున్నాయి.

**త్యాగాలకు ప్రతీక**

ఇబ్రహీమ్ ఖలీలుల్లా, ఇస్మాయిల్ జబీవుల్లా ప్రవక్తల త్యాగాలకు ప్రతీకగా బక్రీద్ పండగ చేసుకుంటారు. ఆదే రోజు పవిత్రమైన పుణ్య క్షేత్రం మక్కా ప్రాంతంలో హజ్ జరుగుతుంది. మక్కాలోని కాబా సమీపంలో ఉన్న అర్ఫత్ మైదానంలో ఉన్న పెద్ద మసీదులో బక్రీద్ నమాజ్ చేయడంతో పాటు పల నియమ నిబంధనలతో ప్రార్థనలు చేస్తే హజ్ పూర్తవుతుంది. అల్లాహ్ సూచించిన ఇస్లాం ధర్మ సూత్రాల్లో ఇది ఒకటి. తమ జీవితంలో పాటించాల్సిన పంచ నియమాలను పవిత్ర గ్రంథం ఖురాన్‌లో అల్లాహ్ సూచించారు. అవే ఈమాన్, రోజుకు ఐదు పూటల నమాజ్, రోజా, జకాత్, హజ్ యాత్ర. ఆర్థికంగా శక్తి ఉన్న ప్రతి ముస్లిం జీవితంలో ఒక సారైనా హజ్ చేయాలని 'ఫరజ్' (తప్పని సరిగా చేయాలని)గా ప్రస్తావించారు. ఇది 40 రోజుల యాత్ర.

**ఈద్గాలతో పాటు మసీదుల్లో ఏర్పాట్లు**

మచిలీపట్నంలోని ఈద్గాతో పాటు నగరంలోని జామా మసీదు, ఇతర ప్రధాన మసీదుల్లో ఈద్ నమాజ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 7 గంటల నుంచి వీలును బట్టి నమాజ్ వేళలను మసీదు కమిటీలు నిర్ణయించి ముందుగానే ప్రకటిస్తాయి. అలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్న ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ఈద్ ప్రార్థనలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ముస్లిం, హిందూ అనే తేడా లేకుండా ఒకరినొకరు శుభాకాంక్షలు చెప్పుకొని మతసామరస్యానికి ప్రతీకను చాటుకుంటారు.

### ఈద్గాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించండి



జేసీ గీతాంజలిశర్మ

చిలకలపూడి: బక్రీద్ పండుగ నేపథ్యంలో ఈద్గాల వద్ద శాని టేషన్, మౌలిక సదుపాయాలు కల్పించాలని జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ అధికారులను ఆదేశించారు. వర్చువల్ విదానంలో శనివారం ఆమె అధికారులతో సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఈద్గాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. కబేళాల వద్ద పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కువ సంఖ్యలో ముస్లింలు పాల్గొనే ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణతో పాటు శాంతి, భద్రతల సమస్య ఏర్పడకుండా చూడాలన్నారు. బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకునేందుకు ముందస్తు భద్రత చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే నేరుగా తనను ఫోన్‌లో సంప్రదించవచ్చునని ఆమె తెలిపారు. మైనార్టీ సంక్షేమం, వక్ఫ్‌బోర్డు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అడిషనల్ ఎస్పీ జి.వెంకటేశ్వరరావు, డీఆర్వో కె. చంద్రశేఖరరావు, డీపీవో నాగేశ్వరనాయక్, మైనార్టీ సంక్షేమ శాఖాధికారి షంషున్నీసాబేగం, మునిసిపల్ కమిషనర్లు, డీఎస్పీలు పాల్గొన్నారు.

### సేవా గుణం ఉండాలి



ప్రవక్తల త్యాగానికి ప్రతీక బక్రీద్. ఆనాడు వారు అనుసరిస్తే.. నేడు పండగలా జరుపుకుంటున్నాం. ప్రవక్తల జీవితాలు, వారు అనుసరించిన విధానాలను ఆదర్శంగా తీసుకొని అనుసరించాలి. చెడు మార్గాలకు దూరంగా, మంచి, శాంతి మార్గాల్లో నడవాలి. సేవా గుణం కలిగి ఉండాలి. పండగ తరువాత కూడా ఇదే స్ఫూర్తితో మెలగాలి.

– ఎండీ. సద్రుద్దీన్ ఖురేషి, ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి

# ఎస్పీని కలిసిన పెడన, పామర్రు ఎమ్మెల్యేలు



ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేస్తున్న పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్



ఎస్పీకి మొక్క అందజేస్తున్న పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

కోనేరుసెంటర్: పెడన, పామర్రు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు వర్ల కుమార్ రాజా, కాగిత కృష్ణ ప్రసాద్ శనివారం జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మిని జిల్లా పోలీస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి ఇద్దరు ఎమ్మెల్యేలు మొక్కలు అందజేశారు. ఇటీవల జరిగిన ఎన్నికలలో శాసనసభ్యులుగా ఎన్నికైన వర్ల కుమార్ రాజా, కాగిత కృష్ణ ప్రసాద్‌లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం శాంతిభద్రతలపై ఎమ్మెల్యేలు ఎస్పీతో ముచ్చటించారు.

### చికిత్స పొందుతూ హోంగార్డు మృతి

పెడన: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ హోంగార్డు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై పెడన పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. బంటుమిల్లి మండలం ఆర్తమూరు గ్రామానికి చెందిన కాగిత పోతురాజు (48) మచిలీపట్నం ఆర్టీవో కార్యాలయంలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల ఏడో తేదీన విధులు ముగించుకుని ఆర్తమూరుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. పెడన పరిధిలోని లజ్జబండ సమీపంలో కుక్క అడ్డురావడంతో బండి అదుపుతప్పి పోతురాజు కిందపడి గాయపడ్డాడు. స్థానికులు గమనించి పెడనలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి బాగానే ఉందనిపించి ఇంటికి వెళ్లిపోయారు. రెండు రోజులు కిందట తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో మచిలీపట్నంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో విజయవాడకు రిఫర్ చేయడంతో తీసుకువెళ్తుండగా మార్గం మధ్యలో చనిపోయాడు. భార్య అమలేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెడన ఎస్‌ఐ సూర్యశ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

మైలవరం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన బైపాస్ రోడ్డులో శనివారం చోటుచేసుకుంది. జి.కొండూరు మండలం చిన నందిగామకు చెందిన బొలుసు మురళి (33) చంద్రగూడెం వైపు నుంచి మైలవరం బైపాస్ రోడ్డులో వెళుతుండగా బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. వెనుక నుంచి వచ్చిన కార్ టైర్ కింద పడి తల నుజ్జునజ్జు అయింది. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు.

# ఎనికేపాడులో భారీ చోరీ

- పచారీ దుకాణం నిర్వహిస్తున్న వృద్ధ దంపతులపై దుండగుల దాడి
- కాళ్లు, చేతులు కట్టేసి 12 తులాల బంగారం, రూ 1.70 లక్షల నగదు దోపిడీ



దాడి గురించి పోలీసులకు వివరిస్తున్న సత్యనారాయణ, గోవిందమ్మ దంపతులు

రామవరప్పాడు : విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు కేవీఆర్ కాలనీ, టయోటా షోరూమ్ ఎదురుగా జాతీయ రహదారిని ఆనుకుని నిర్వహిస్తున్న ఓ పచారీ దుకాణంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు బంగారం, నగదు అపహరించారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పేరూరి సత్యనారాయణ, గోవిందమ్మ దంపతులు గత 20 సంవత్సరాలుగా పచారీ దుకాణం నిర్వహించుకుంటూ జీవిస్తున్నారు. వీరి పిల్లలకు వివాహం కాగా భార్యాభర్తలిద్దరే ఉంటున్నారు. గ్రామంలోని కేవీఆర్ కాలనీలోని ఓ షాపును అద్దెకు తీసుకుని స్టార్ జనరల్ స్టోర్స్ పేరిట పచారీ దుకాణం నిర్వహిస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. శుక్రవారం రాత్రి 9.30 గంటల సమయంలో గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు వచ్చి తమకు సిగరెట్లు కావాలని అడిగారు. సత్యనారాయణ సిగరెట్లు ఇస్తుండగా వెనుకగా వచ్చి టవల్‌ను మెడకు వేసి బెడ్‌రూమ్‌లోకి లాక్కెల్లి ఫ్రిడ్జి వద్ద పడేశారు. ఇదే సమయంలో సత్యనారాయణ భార్య గోవిందమ్మ ఈ హఠాత్తు పరిణామం నుంచి తేరుకోకముందే ఆమెను కూడా నోరు మూసేసి అరిస్తే చంపేస్తామని బెదరించారు. ఇద్దరినీ అక్కడే ఉన్న బెడ్‌షీట్‌తో చేతులు కట్టెశారు. గోవిందమ్మ మెడలో ఉన్న నానుతాడు, చైను, బంగారు వస్తువులు సుమారు 12 కాసులు బలవంతంగా లాక్కున్నారు. బీరువాలో దాచిన రూ 1.70 లక్షల నగదు, దుకాణంలోని గల్లా పెట్టెలో ఉన్న డబ్బును దోచుకున్నారు. చంపేస్తామని బెదిరిండంతో ఈ వృద్ధ దంపతులు ప్రాణ భయంతో మిన్నకుండిపోయారు. తమ పని అయిపోయిన తర్వాత సత్యనారాయణ సెల్ ఫోన్‌లోని సిమ్ తీసేసి అక్కడే పడేశారు. దుకాణం షట్టర్‌ను మూసి వేసి అక్కడి నుంచి పరారయ్యారు. దుండగులు కాళ్లు, చేతులు కట్టియడంతో సుమారు గంట వరకూ పెనుగులాడి కట్లు విడిపించుకున్న తర్వాత షట్టర్ తీసుకుని భయటకు వచ్చి కేకలు వేశారు. సమీపంలోని వారికి విషయం చెప్పడంతో పోలీసులకు సమాచారం అందించారు. దుండగులు, వృద్ధ దంపతుల మధ్య పెనుగులాట చోటు చేసుకోవడంతో వీరికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న సెంట్రల్ ఏసీపీ భాస్కరరావు, ఎస్‌ఐ సతీష్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. దొంగలను గుర్తించేందుకు చుట్టుపక్కల సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేత



విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డీఈవో తాహెరా సుల్తానా

చిలకలపూడి(మచిలీపట్నం): విద్యార్థి దశ నుంచే పర్యావరణంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి జిల్లా విద్యాశాఖాధికారి తాహెరాసుల్తానా అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వివిధ తరగతులకు చెందిన విద్యార్థులకు జిల్లా స్థాయి వ్యాసరచన, పోస్టర్ ప్రజెంటేషన్, వక్తృత్వ పోటీల్లో విజేతలకు శనివారం ప్రశంసాపత్రాలు అందజేశారు. డీఈవో మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో అందరం భాగస్వామ్యులం కావాలని తెలిపారు. మండలస్థాయిలో ఆఫ్‌లైన్ పద్ధతిలో నిర్వహించిన వ్యాసరచన, పోస్టర్ ప్రజెంటేషన్, డిబేటింగ్ పోటీల్లో ఒక్కొక్క విభాగం నుంచి ఒక విద్యార్థిని ఎంపిక చేసి జిల్లా స్థాయి పోటీలను ఆన్‌లైన్‌లో నిర్వహించామని తెలిపారు. డిస్ట్రిక్ కామన్ బోర్డు సెక్రటరీ షేక్ జాన్‌సాహెబ్, ఆప్‌కాస్ట్ డిస్ట్రిక్ కో–ఆర్డినేటర్ ఎం. శ్రీనివాసరావు, డిస్ట్రిక్ సైన్స్ ఆఫీసర్ జాకీర్ అహ్మద్, సురేష్‌కుమార్, మొమిన్ తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులకు ప్రేమానురాగాలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వృద్ధులకు ప్రేమానురాగాలు, ఆప్యాయతలు పంచాలని, వారి శ్రేయస్సుతోనే సమాజానికి ఉషస్సు అని కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. ఐలాపురం హోటల్‌లో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధులపై వేధింపుల నివారణ అవగాహన దినోత్సవం శనివారం నిర్వహించారు. తొలుత ఢిల్లీరావును మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య సత్కరించారు. అదే విధంగా కలెక్టర్ ఢిల్లీరావు.. ఐలాపురం వెంకయ్యను సత్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్నేషనల్ నెట్వర్క్ ఫర్ ది ప్రివెన్షన్ ఆఫ్ ఎల్డర్ అబ్యూస్ (ఐఎన్‌పీఈఏ) స్వచ్ఛంద సంస్థ తొలిసారిగా 2006, జూన్ 15న ప్రపంచ వృద్ధులపై వేధింపుల నివారణ అవగాహన దినోత్సవాన్ని నిర్వహించిందన్నారు. వృద్ధుల శారీరక, మానసిక ఆరోగ్యానికి, ఆర్థిక భద్రతకు సమాజంలోని ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో వృద్ధుల గౌరవప్రద జీవితానికి భరోసా కల్పిద్దామని పిలుపునిచ్చారు. వయోవృద్ధుల సంక్షేమ చట్టం -2007, వయోవృద్ధుల సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన పెంపొందించి.. వాటిని సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. వేధింపులకు సంబంధించి వృద్ధుల ఫిర్యాదులపై డివిజన్ స్థాయిలో సత్వర పరిష్కారానికి కృషిచేస్తున్నట్లు చెప్పారు. జిల్లా స్థాయి కమిటీలు ఎప్పటికప్పుడు సమావేశమై నాణ్యమైన చర్చలతో మంచి ఫలితాలు వచ్చేలా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. గొప్ప కుటుంబ వ్యవస్థకు నిలయమైన మన దేశంలో వృద్ధులపై వేధింపుల ఘటనలు చోటుచేసుకోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వీటికి కారణాలను గుర్తించి, సరైన కార్యాచరణ ద్వారా వేధింపులకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరముందని స్పష్టం చేశారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వేమూరు బాబూరావు మాట్లాడుతూ కలెక్టర్ ఢిల్లీరావు నేతృత్వంలో వృద్ధుల సంక్షేమానికి విశేష కృషి జరుగుతోందన్నారు. జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు, హెల్పేజ్ ఇండియా ప్రతినిధి లంకపల్లి మృణాల్, బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.చంద్రమౌళి, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ వి.కామరాజు, వాసవ్య మహిళా మండలి ప్రెసిడెంట్ డాక్టర్ బి.కీర్తి, డాక్టర్ సీఎల్ వెంకటరావు, సీవీ బాబు, ప్రజా కళాకారులు పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.